సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 1 । జనవరి । 2025



నూతన సంవత్సర వేళ ప్రజలు, వాహనదారులతో కిటకిటలాడుతున్న కడప నగరంలోని మద్రాస్ రోడ్డు

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



ఆలయ సిబ్బందికి నగదు అందజేస్తున్న దాతలు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం కార్యక్రమానికి కదిరికి చెందిన భక్తులు మంగళవారం విరాళాలు సమర్పించారు. కదిరి పట్టణానికి చెందిన గురుప్రణవ్, ప్రతాప్, వీరభవవ్‌లు ఒకొక్కరు (ఒకే కుటుంబ సభ్యులు) రూ.లక్ష చొప్పున మొత్తం రూ.3లక్షలు అందజేశారు. ఈ మొత్తాన్ని స్వామి పేరున నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఉపయోగించాలని వారు కోరారని ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు. అనంతరం దాతలను సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

టీఎన్ బంగ్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

తంబళ్లపల్లె: ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎన్ అరవిందరెడ్డి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిశారు. తంబళ్లపల్లెలో తమ టీఎన్ బంగ్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తే గ్రామీణ నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశం కలుగుతుందని సూచించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ టీఎన్ బంగ్లాను పరిశీలించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు సూచించారు. మంగళవారం సబ్ కలెక్టర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగార్జునతో కలిసి తంబళ్లపల్లెలోని టీఎన్ వంశీకుల బంగ్లాను పరిశీలించారు. నివేదికలను రూపొందించి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆయన వెంట టీఎన్ రాజశేఖరరెడ్డి, తహశీల్దార్ హరికుమార్, సర్వేయర్ రఫీ, టీఎస్ మేనేజర్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి



జైల్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కడప జిల్లా సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్

రాయచోటి టౌన్: ప్రతి ఒక్కరూ న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి సబ్ జైల్లో నిందితులుగా ఉన్న వారికి కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. అక్కడ ఖైదీలుగా ఉన్న వారితో మాట్లాడారు. జైలు లోపల ఉన్న ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సలహాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌పై మాట్లాడారు. అనంతరం ఆయన వంట గదులు, వసతి గదులు, టాయిలెట్లు, రిజిస్టర్లను పరిశీలించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి ప్రచారం నిర్వహించినట్లు చెప్పారు.

నయాజోష్

- న్యూఇయర్‌కు గ్రాండ్‌గా వెల్కమ్ చెప్పిన యూత్
- వెల్లువెత్తిన సంబరాలు
- శుభాకాంక్షల కోలాహలం
- యువత హల్‌చల్

రాజంపేట టౌన్: న్యూఇయర్ సందర్భంగా అందరిలోను ఉత్సాహం ఉరకలేసింది... మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే ప్రజల ఆనందానికి ఆకాశమే హద్దయింది. సెల్‌ఫోన్‌లో 11:59 నిమిషాలు కాగానే అనేక మంది ఆ ఒక్క నిమిషం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూశారు. సరిగ్గా 12 గంటలు కాగానే పాత ఏడాది కాలగర్భంలో కలిసిపోయి..కొత్త ఏడాది రావడంతో ప్రజలంతా వారివారి ఇళ్లల్లో, ప్రాంతాల్లో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు. ఇక యువత బైబై 2024 వెల్‌కం 2025 అంటూ పెద్దపెట్టున కేకలు పెట్టి న్యూఇయర్‌కు గ్రాండ్‌గా వెల్కమ్ చెప్పారు. పల్లె, పట్టణం అన్న తేడాలేకుండా అన్ని ప్రాంతాల్లో న్యూఇయర్ జోష్ కనిపించింది. అనేక ప్రాంతాల్లోని ప్రజలు ఒక సమూహంగా ఏర్పడి కేక్‌ను కట్‌చేసి సంతోషాన్ని పంచుకున్నారు. కొంతమంది యువకులు రెట్టింపు ఉత్సాహంతో తోటి మిత్రులను, ఆత్మీయులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియచేశారు. మరికొంత మంది యువకులు కేక్‌లను ఒకరిపై ఒకరు పూసుకొని సందడి చేశారు. కాగా అనేక మంది ఆలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో పూజలు, ప్రార్థనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఏదిఏమైనా న్యూఇయర్ ఆగమనం అందరిలోనూ నూతనోత్సాహాన్ని నింపింది. కేక్లు, దుస్తులు, పూలు, పండ్లు కొనుగోలు దారులతో వ్యాపార సముదాయాలు కిక్కిరిసి కనిపించాయి.



బార్బీ బొమ్మ ఆకారంలో కేకు



రాజంపేటలో కిక్కిరిసిన దుస్తుల దుకాణం



కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



బొకేల అమ్మకాలు

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లా ప్రజలందరికీ 2025 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే 2025 ఆంగ్ల నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. అలాగే జనవరి 1వ తేదీన నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తనను కలవడానికి వచ్చేవారు పుష్ప గుచ్ఛాలు, శాలువాలు, కేకులు తీసుకురావద్దని ఆ ప్రకటనలో తెలిపారు. భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇటీవల మృతిచెందిన సందర్భంగా సంతాప దినాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

తమ్ముళ్ల తగవులు

- టీడీపీలో విబేధాల కారణంగా రాయచోటిలో టాటూ షాపు దగ్ధం
- రాడ్లు, కత్తులతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ
- సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా సంఘటన
- అధికారులకు తలనొప్పిగా మారుతున్న వ్యవహారాలు
- ఒకరు వద్దంటే...మరొకరు చేయాలంటూ యంత్రాంగంపై ఒత్తిళ్లు



సాక్షి రాయచోటి: అధికార టీడీపీలో తెలుగు తమ్ముళ్ల తగవులు పెచ్చుమీరుతున్నాయి. అధికారంలోకి రాగానే ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆధిపత్యం చెలాయించేందుకు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటున్నారు. అధికారం ఉంది కదా.. ఏం చేసినా చెల్లుతుందనే ధోరణిలో ఎందాకైనా వెళుతున్నారు. ఒకవైపు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ.. ఆధిపత్య పోరాటం చేస్తూ నడిరోడ్డుపైనే కొట్టుకుంటుండడం చూసి పలువురు నవ్వుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని తరహాలో రాయచోటిలోనూ కొత్త సంస్కృతి తెరమీదికి వస్తుండటంతో అధికారులు ఒత్తిడికి లోనవుతున్నారు. తాము చెప్పిందే చేయాలని ఒకవర్గం, ఆ పనిచేయవద్దని మరోవర్గం పేచీలు పెడుతుండడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇలా ఎక్కడ చూసినా కూటమి సర్కార్ హయాంలో విపత్కర పరిస్థితులు జిల్లాలో ఆందోళన కలిగిస్తున్నాయి.

రాయచోటిలో భయానక పరిస్థితి సృష్టించిన తమ్ముళ్లు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో తెలుగు తమ్ముళ్లు భయానక పరిస్థితిని సృష్టించారు. రాష్ట్ర రవాణ, క్రీడలుశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయచోటిలో తమ్ముళ్ల గొడవలు తారా స్థాయికి చేరాయి. రెండురోజుల కిందట గునికుంట్ల రోడ్డు చివరలో చెరువుకట్ట వద్ద టీడీపీలోని కీలక నేతలకు చెందిన ఇరువర్గాలు ఇష్టానుసారంగా రాడ్లు, కత్తులతో దాడులకు పాల్పడ్డారు. అది చాలదన్నట్లు జగదాంబ సెంటర్ వద్ద కూడా మరోమారు అలజడి రేపారు. బజారులోని బహిరంగంగా దాడులకు దిగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అంతటితో ఆగకుండా ఓ వర్గం ఏకంగా రాయచోటి నడిబొడ్డున ఉన్న టాటూ కేంద్రానికి నిప్పు పెట్టారు. ఒకరినొకరు కొట్టుకోవడంతో పెద్ద ఎత్తున గాయాలై ఆస్పత్రిపాలయ్యారు. ఎవరికి వారు ఫిర్యాదులతో ఏకంగా మూడు కేసులు కూడా నమోదయ్యాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎప్పుడూ ప్రశాంతం ఉండే రాయచోటిలో దాడులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే పరిణామం.

రైల్వేకోడూరులోనూ అధికారులకు తలనొప్పులు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఏ పనిచేయాలన్నా అధికారులకు తలనొప్పిగా మారింది. రైల్వేకోడూరులో టీడీపీ ఇన్‌చార్జి ఉండి ఇటీవలే నామినేటెడ్ పదవి పొందిన రూపానందరెడ్డి కుటుంబంతోపాటు ఎమ్మెల్యే ఒక వర్గంగా ఉంటూ పావులు కదుపుతున్నారు. ప్రజలు పనుల నిమిత్తం రూపానందరెడ్డి కుటుంబం వద్దకు వచ్చినపుడు ఒక్కొక్కరు ఒక్కో రీతిన అధికారులకు సిఫార్సు చేస్తుండడం, ఒకరు చేయాలని మరొకరు వద్దని వారిలో వారే చెబుతుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఇదే కాకుండా మరో ప్రక్క మాజీ టీడీపీ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయులు వర్గాలు కూడా ఉండడంతో అధికారులు అందరి మధ్య నలిగిపోతున్నారు. రైల్వేకోడూరులో బయటికి అందరూ ఐక్యంగా ఉన్నామని కనిపిస్తున్నా లోపల మాత్రం వర్గాల నేతలు ఎవరికి వారు కత్తులు దూసుకుంటున్నారు.

రాజంపేటలో తారాస్థాయికి ఆధిపత్య పోరు

రాజంపేట నియోజకవర్గంలోనూ తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ప్రత్యేకంగా టీడీపీలోని అంత్యరుద్ధం తలనొప్పిగా మారింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన సుగవాసి బాలసుబ్రమణ్యం, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న జగన్‌మోహన్‌రాజు వర్గాల మధ్య పచ్చగడ్డివేస్తే ఆయా వర్గాలు భగ్గుమంటున్నాయి. ఇటీవల రాజంపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ సందర్భంగా ఇరువురు ప్రధాన నేతలే క్యాంటీన్ ప్రారంభించేందుకు ఒకరినొకరు అందరి ముందు తోసుకున్న విషయం అందరికీ తెలిసిందే. అంతేకాకుండా నాలుగు రోజుల కిందట ఒంటిమిట్టలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా రెండు వర్గాల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం జరిగి రచ్చకు దారి తీసింది. అంతేకాకుండా నియోజకవర్గంలోని అన్నిచోట్ల గ్రూపు రాజకీయాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇక్కడ కూడా ఒక వర్గం అది చేయాలని ఆదేశిస్తే...మరోవర్గం ఆ పని వద్దంటుండడంతో అధికారులు ఏమిటీ ఈ తలనొప్పి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్కడ కూడా అంతే...

జిల్లాలోని పీలేరు మినహా మిగిలిన మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోనూ టీడీపీలో వర్గాలు కొనసాగుతున్నాయి. మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషకు వ్యతిరేకంగా కిందిస్థాయి నాయకులంతా ఒక గ్రూపుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యేపై సీఎంతోపాటు మంత్రి లోకేష్‌కు ఒక రెవెన్యూ అధికారి ఫిర్యాదు చేసినప్పటి నుంచి నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు ఊపందుకున్నాయి. మరోప్రక్క తంబళ్లపల్లెలోనూ టీడీపీ తరుపునపోటీ చేసి ఓడిపోయిన జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌తోపాటు మరికొన్ని వర్గాలు అక్కడ బలంగా పనిచేస్తున్నాయి. దీంతో అక్కడ పోలీసు అధికారులతోపాటు రెవెన్యూ, ఇతర అధికారులు కూడా పనుల విషయంగా తర్జనభర్జన పడుతున్నారు. బదిలీలు మొదలుకొని ఇతర అన్ని అంశాల్లోనూ అక్కడ పలు గ్రూపుల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ఏది ఏమైనా అన్నమయ్య జిల్లాలో అధికార తెలుగుదేశంలో గ్రూపు రాజకీయాలు చలికాలంలోనూ వేడి పుట్టిస్తున్నాయి.

ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి



ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24–7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం రాయచోటి మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాల బీయులు, సీయూలను ఇక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లారెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించాలి

రైల్వేకోడూరు అర్బన్: నిత్యజీవితంలో దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించి తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక హెచ్ఎంఎం హైస్కూల్‌లో ఎమ్మెల్యే అరవశ్రీధర్‌తో కలిసి కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా 57 లక్షలతో 397 మంది దివ్యాంగులకు మూడు చక్రాల బ్యాటరీసైకిళ్లు, ఉపకరణాలను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు కేంద్రం, రాష్ట్రం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు వేగవంగా పూర్తయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ డైరక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా అధికారి కృష్ణకిషోర్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

చల్లని వేడుకకు చలో హార్సిలీహిల్స్!

- పోలీసు వలయంలో పర్యాటకులకు భద్రత
- నిరంతరంగా మదనపల్లె, కాండ్లమడుగు, బి.కొత్తకోట నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు
- బైక్, ఆటోలకు ప్రవేశం లేదు

బి.కొత్తకోట: ఆంధ్రాఊటీ, పేదల ఊటీగా పేరుగాంచిన బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన ఏడాదిని పురస్కరించుని బుధవారం చల్లని వేడుకలు జరుపుకునేందుకు సాధారణ పర్యాటకులు సిద్ధమయ్యారు. హార్సిలీహిల్స్‌పై పేదలు ఏటా వేడుకలు జరుపుకునేందుకు తరలివస్తారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు, శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతిజిల్లాలకు చెందిన పర్యాటకులు కొండకు చేరుకుని విందులు, వినోదాలతో గడిపి సాయంత్రానికి వెనుదిరుగుతారు. దీనితో కొండపైకి వేల సంఖ్యలో వచ్చే సందర్శకులతో కిటకిటలాడుతుంది. పర్యాటకుల కోసం రోజంతా నిరంతరంగా మదనపల్లె, బి.కొత్తకోట, కాండ్లమడుగు నుంచి 25 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు.

గెస్ట్‌హౌస్‌లు ఫుల్

నూతన వేడుకలు జరుపుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు హార్సిలీహిల్స్‌పై టూరిజం, ప్రైవేటు అతిథిగృహాలను ముందస్తుగానే బుక్ చేసుకున్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే పర్యాటకులు కొండకు చేరుకుంటున్నారు. విడిది చేసిన సందర్శకులు అర్ధరాత్రిలో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వేడుకలు జరుపుకుంటారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు అతిథిగృహలన్నీ నిండిపోయాయి. ఒక్క గది కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ బస చేసే పర్యాటకులు అర్ధరాత్రి రోడ్లపై కేరింతలతో కేక్ కట్ చేయడం, మిత్రులు, కుటుంబాలతో కలిసి సందడి చేస్తారు.




పోలీసులకు విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ

నేడు వేలల్లో రాక

కొండపై వేడుకలు జరుపుకునేందుకు బుధవారం సందర్శకులు పదివేల మందికి తగ్గకుండా వచ్చే అవకాశం ఉంది. ఇళ్లనుంచి, స్థానికంగా హోటళ్ల నుంచి తెచ్చుకొన్న భోజనంతో విందులు చేసుకొంటారు. కుటుంబాలతో వచ్చే కూడా సందర్శకులు ఉంటారు. హార్సిలీహిల్స్ ప్రకృతి ప్రియులకు ఇష్టమైన ప్రాంతం. తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డుపై కొండమీదికి వెళ్లాలి. కొండపైకి వెళ్తానే ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. వేల సంఖ్యలో సందర్శకులు వస్తున్నందున ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు బైక్, ఆటోలను కొండపైకి వెళ్లనివ్వకుండా నిషేధించారు. కొండ ప్రారంభంలో పోలీసు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మద్యం తీసుకెళ్తే అనుమతి ఇవ్వరు.

ఇక్కడ జాగ్రత్తగా ఉండాలి

హార్సిలీకొండపై జమునా బిల్డింగ్ వెనుక, గాలిబండ, పాత వ్యూపాయింట్ అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలు. పాత వ్యూపాయింట్ వెనుకున్న పెద్దబండరాయిపైకి యువకులు ఎక్కి సాహస విన్యాసాలు చేస్తుంటారు. దీనిపై నుంచి పొరబాటను జారితే ఎక్కడ పడతారో కనుక్కోవడం కష్టం. ఈ ప్రాంతాల్లో సందర్శకులు జాగ్రత్తగా ఉండటంతోపాటు పోలీసులను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా కొండపై భద్రతకు పోలీసులను మోహరింపజేశారు. మంగళవారం ఉదయమే నియమింపబడిన సిబ్బంది హార్సిలీహిల్స్ కిందకు చేరుకున్నారు. వీరికి కేటాయించిన చోటు, విధులపై సీఐ జీవన్ గంగనాథ్ బాబు అవగాహన కల్పించారు. పర్యాటకుల భద్రత ముఖ్యమని జాగ్రత్తగా వ్యవహరించాలని సూచనలు చేశారు.



ప్రమాదకర బండపై పర్యాటకులు (ఫైల్)

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్: జాతీయస్థాయి అండర్–14 క్రికెట్ పోటీలకు వైఎస్ఆర్ జిల్లాకు చెందిన ఇర్ఫాన్ ఎంపికయ్యాడు. ప్రొద్దుటూరుకు చెందిన ఈ యువ క్రికెటర్ నవంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనపరిచాడు.

హెచ్‌ఎంకు సత్కారం

పెనగలూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన రోశయ్య దంపతులను మంగళవారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.



శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి : వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచి శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటిలోని డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల విశేషాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యున్నత స్థానానికి ఎదగాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా విద్యార్థులు పరిశీలించడం అలవాటు చేసుకోవాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చన్నారు. ప్రాజెక్టుల ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరు ప్రాజెక్టులకు మంత్రి తన చేతుల మీదుగా మెమెంటోలను సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండలానికి మూడు చొప్పున 30 మండలాల నుంచి మూడు విభాగాలలో 90 ప్రాజెక్టులు వచ్చాయన్నారు.

విజేతలు వీరే...

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో ఎం.మహేష్, ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్, సంజీవపురం, ఓబులవారిపల్లి, కె.గీతేశ్వర్(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామసముద్రం)

గ్రూపు విభాగంలో...

ఎస్‌ఎండీ రెహాన్, మహమ్మద్ సుహేల్, (ఏపీ ఎంఎస్, కలకడ, విద్యార్థులు), విశ్వ వర్ధన్ రెడ్డి, సంతోష్ కుమార్ రెడ్డి, (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలిచర్ల, పెద్దమండ్యం మండలం)

ఉపాధ్యాయ విభాగంలో...

ఏ.శివ నారాయణ గౌడ్, (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, చిట్వేలి), మార్ల ఓబుల్ రెడ్డి, (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సంబేపల్లి). ఈ కార్యక్రమంలో డీఈఓ సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, స్కౌట్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగముని రెడ్డి, అప్కాస్ట్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వాటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు.

కేఆర్ నారాయణపురంలో పశు వైద్య బృందం


కె.ఆర్.నారాయణపురంలో వైద్యాధికారులు

రామాపురం: కసిరెడ్డిగారిపల్లె పంచాయితీ కె.ఆర్.నారాయణపురం, ఎన్.ఎన్. పురం గ్రామాలలో డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య బృందం పర్యటించింది. మూగ జీవాలకు వింత వ్యాధి శీర్షిక న సాక్షిలో ప్రచురితమైన కథనంపై వైద్యాధికారులు స్పందించారు. పశువులను పరిశీలించిన అధికారులు ఇది వింత వ్యాధి కాదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.





రాజంపేట టీడీపీ నేతపై కేసు నమోదు

రాజంపేట : రాజంపేట టీడీపీ నేత కె.సుబ్రమణ్యం నాయుడుపై మంగళవారం మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి స్థలం వివాదంపై తన వదిన వెంకటసుబ్బమ్మపై సుబ్రమణ్యం నాయుడు దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమె రాజంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తనను దూషించి చేయి చేసుకున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు సీఐ అలీ తెలిపారు.

కువైట్ రెడ్డి అసోసియేషన్ సహకారంతో ఇంటికి చేరిన మృతదేహం


జయరామయ్య (ఫైల్)

ఒంటిమిట్ట : బతుకు దెరువు కోసం కువైట్ వెళ్లిన కత్తి జయరామయ్య (52) గుండెపోటుతో ఆదివారం అక్కడే మృతి చెందారు. ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకపాటి నంద కిషోర్ రెడ్డి చొరవ చూపి కువైట్ రెడ్డి అసోసియేషన్ వారి సహకారంతో మృతదేహాన్ని మంగళవారం స్వస్థలానికి చేర్చారు. కొన్ని సంవత్సరాలుగా కువైట్‌లో ఉన్న కత్తి జయరామయ్యకు గుండెపోటు రావడంతో కువైట్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. కువైట్‌లో జయరామయ్యకు సంబంధించిన వారు ఎవ్వరూ లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకపాటి నందకిషోర్ రెడ్డికి విన్నవించారు. వెంటనే ఆయన కువైట్ రెడ్డి అసోసియేషన్ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డి, మునిరెడ్డిల సహకారంతో వారి సొంత ఖర్చులతో కత్తి జయరామయ్య మృతదేహాన్ని స్వస్థలానికి పంపించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కువైట్‌లో నీలకంఠ్రావు పేట వాసి మృతి

రామాపురం : బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన నీలకంఠ్రావుపేటకు చెందిన సయ్యద్ జియావుద్దీన్(47) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఇక్కడికి సమాచారం అందింది. ఆయన 15 ఏళ్ల క్రితం కువైట్ వెళ్లాడు. ఏడాదికి ఒక్కసారి ఇంటికి వస్తూ ఉండేవాడు. అతను మృతి చెందిన విషయం అక్కడి బంధువుల ద్వారా తెలిసింది. మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుతుందని కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలసిన కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, అలాగే పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు, ప్రజలు, శ్రామికులకు కొత్త సంవత్సరం సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు.





విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసింహ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నరసింహ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏమాత్రం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : నిరంతరం విద్యార్థుల హక్కులు సాధించే వరకు నిరంతరం ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతూనే ఉంటుందని మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.







తెలుగు తమ్ముళ్లపై కేసులు నమోదు

3 ఫిర్యాదులు, 20 మందిపై కేసులు

రాయచోటి: రాయచోటిలో వీరంగం సృష్టించిన తెలుగు యువ తమ్ముళ్లు 20 మందిపై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదైనట్లు ఎస్‌ఐ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఇరు వర్గాలు ఘర్షణ పడిన సంఘటనపై మూడు కేసులు నమోదు చేశామన్నారు. రాయచోటిలో సోమవారం తెలుగుదేశం పార్టీకి చెందిన బాషా వర్గం, కొత్తపేట తెలుగు యువత వర్గాలు దాడులకు దిగి వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ దాడి సంఘటనలో భాగంగా టాటోషాప్‌కు నిప్పు అంటించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలపై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు మూడు కేసులలో 20 మందిపై కేసు నమోదు చేశామన్నారు. కొత్తపేట తెలుగు యువత వర్గానికి చెందిన విక్రమ్, శ్రావణ్, సతీష్, రాహుల్, అభి, శివ, మంజునాథ్, హరి, సాయి లోకేష్, శివ, కృష్ణ, దీక్షితులపై కేసు నమోదైంది. అలాగే బాషా వర్గానికి చెందిన సునీల్, పిల్ల మహేష్, రెడ్డి బాషా, మనోహర్, దుర్గా, ధనుష్, బెండు అస్లాం, చరణ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే రాయచోటి పట్టణం, కొత్తపేట జగదాంబ సెంటర్‌లో ఉన్న టాటో షాపునకు నిప్పు అంటించిన సంఘటనలో బాషా వర్గంపై రెండో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే వీరందరినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.





వరుణ్ వీరోచిత సెంచరీ



82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా

అహ్మదాబాద్: భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

వారెవ్వా వైశాలి



మహిళల విభాగంలో అగ్ర స్థానంతో నాకౌట్‌కు అర్హత

- హంపి చేజారిన అవకాశం
- వరల్డ్ చెస్ 'బ్లిట్జ్' చాంపియన్‌షిప్

న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పొలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్ర స్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జు జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్‌ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

అర్జున్‌కు నిరాశ...

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్‌ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజీబెక్ నొగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు



- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ

ముంబై: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.



2025 స్పోర్ట్స్ క్యాలెండర్
మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1–0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరఫున రాబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రాబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.

సినిమా



విదేశాల్లో 2025

2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...

చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.


• కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్స్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజి' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల


• సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.

ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ


• సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

2024ని మంచి సినిమాతో ముగించాను

- జాన్వీ కపూర్



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్టాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

గుండె జారిపోయిందే!

వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో–నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ–వంశీ.


• వరుణ్ రాజ్, మమత

ఓటీటీ

ఇది చూడొచ్చు

సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.



తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమీర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది, కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టి. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి, కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.